10

# క్రీస్తు యొక్క మంద

"ఈ దొడ్డివికాని వేరే గొఱ్ఱెలును నాకు కలవు; వాటినికూడ నేను తోడుకొని రావలెను, అవి నా స్వరము వినును, అప్పుడు మంద ఒక్కటియు గొఱ్ఱెల కాపరి ఒక్కడును అగును" (యోహాను 10:16).

"ప్రభువు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులనుగా ఉంచెనో ఆ యావత్తుమందను గూర్చియు, మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి" (అపొ. 20:28).

నేను బాధ్యతలచేత కలతపరచబడినప్పుడు, నిరాశపడిన గడియారం అనే చిన్న పిల్లల కథను గూర్చి నేను ఆలోచిస్తాను. ప్రతి సంవత్సరం అది ఎన్ని సార్లు కొట్టుకోవాలో ఒక పాత గడియారం లెక్కించిందట, అలా అది కొట్టుకునే సంఖ్య దాన్ని తడబడ జేయునంత పెద్దదిగా ఉందట. ఆశ్చర్యం గొలిపే ఆ పెద్ద సంఖ్యను గూర్చి అది ఆలోచిస్తుండగా, తాను ఎంతగా నిరాశ పడిందంటే, యిక నేను ఆడడం మానేస్తాను అని అనుకుందట. అన్ని ఎక్కువ సార్లు తాను కొట్టుకోలేననే తీర్మానానికి అది వచ్చి చేరుకుందట. దాని తోటి గడియారం దాని నిరాశను గుర్తించి దానితో మాటలాడ నారంభించిందట. అది ఒక్కొక్క రోజుగానే కొట్టుకోవాలి, ఒక్కొక్క గంటగానే కొట్టుకోవాలి, ఒక్కో నిమిషంగానే కొట్టుకోవాలి, ఒక్కోసారి ఒక్క టిక్ అనే కొట్టుకోవాలి అని తెలిపి రెండవది దీనికి వాస్తవం చూచేలా సహాయపడిందట. ఈ రెండవదాని హెచ్చరిక ముసలి గడియారంయొక్క నిరాశా భావాన్ని బాగుపరచిందట. టిక్ అని ఒకటి ఒక్కసారే కొట్టుకోవాలనే వాస్తవం పాతదానియొక్క తత్వాన్ని పునర్జీవింపజేసి, జీవితానికి నూతన దృక్పథాన్ని ప్రసాదించి, మరలా కొట్టుకొనడానికి ఆరంభించేలా పురికొల్పిందట.

మన ప్రభువు యిలా హెచ్చరించాడు, "రేపటినిగూర్చి చింతింపకుడి; రేపటి దినము దాని సంగతులనుగూర్చి చింతించును; ఏనాటికీడు ఆనాటికి చాలును" (మత్తయి 6:34). నిరాశకు పరిహారం జీవితాన్ని ఒకసారికి ఒక దినాన్ని గడుపుతున్నామని జ్ఞాపకం చేసికొనడమే.

నీవు భయపడుతున్నావా? దేవుని ప్రజలను గెలిచేదానికి దుష్టునికున్న శక్తి ఎంతో గొప్పదని నీవు కలత చెందుతున్నావా? రేపేమి సంభవిస్తుందో అని నీవు చింతిస్తున్నావా? ప్రభువుపట్ల నెరవేర్చవలసిన నీ బాధ్యతలను గూర్చి కలత చెందుతున్నావా?

ఈ భయాలకును, యిలాటి యింకా యితర అనేకమైన వాటికిని యోహాను 10లో ప్రభువైన యేసు ఉదాహరణలతో అభయమిచ్చాడు. తన అనుచరులు తన గొర్రెల మందయనియు, వారితో తనకు ఉన్న సంబంధం, ఒక గొర్రెలవాడు గొర్రెలతో తనకు

కలిగియుండే సంబంధంతో పోల్చాడు. మనం భయపడినప్పుడు గాని కలత చెందినప్పుడు గాని, ఆయన ఉదాహరణను జ్ఞాపకం చేసికో. "మీలో ఉన్నవాడు లోకములో ఉన్నవాని కంటె గొప్పవాడు" అనే గ్రహింపుతో అది నిన్ను ఆదరిస్తోంది (1 యోహాను 4:4). ప్రభువైన యేసుయొక్క అనుచరులు పొందే గొప్ప ప్రేమను అది నీకు గుర్తు చేస్తుంది.

అప్పుడు తన అనుచరులకు తనకు కలిగియున్న సంబంధాన్ని గూర్చి మాట్లాడుతూ ప్రభువైన యేసు ఈ సాదృశ్యాన్ని[1] ఉపయోగించింది, భవిష్యత్తులో తన సంఘమని ఆయన పిలిచే తన అనుచరులకును తనకును మధ్య ఉండబోయే సంబంధాన్ని ఎదురు చూచినందుననే (మత్తయి 16:18). మంచి గొర్రెల కాపరి గొర్రెల కొరకు తన ప్రాణాన్ని పెడతాడని ఆ పోలిక చిత్రిస్తుంది (యోహాను 10:15, 17, 18). ఇది క్రీస్తు ప్రభువు యొక్క సిలువ మరణానికి నేరైన సూచన, దాని ద్వారానే ఆయన తన సంఘాన్ని కొన్నాడు (అపొ. 20:28; ఎఫెసీ. 5:25). తనయొద్దకు వచ్చే యితర గొర్రెలను గూర్చి ఆయన మాట్లాడాడు: "ఈ దొడ్డివికాని వేరే గొఱ్ఱెలును నాకు కలవు; వాటిని కూడ నేను తోడుకొని రావలెను, అవి నా స్వరము వినును, అప్పుడు మంద ఒక్కటియు గొఱ్ఱెల కాపరి ఒక్కడును అగును" (యోహాను 10:16). సంఘాన్ని క్రీస్తు యొక్క గొర్రెల మందగా చూడవలసిన అవసరతను ఈ వచనాలు చూపుతున్నాయి.

సంఘం ఆయన గొర్రెల మందయని ఆలోచించేది, సంఘంకొరకు ఆయన ఏమి చేశాడో దాన్ని అభినందించేలా చేస్తుంది. గనుక, "సంఘమనే తన గొర్రెల మందతో క్రీస్తుకున్న సంబంధమేమి? కాపరిగా క్రీస్తు సంఘంకొరకు ఏమి చేస్తాడు?" అని అడుగుదాం.

## క్రీస్తు సంఘమునకు ప్రభువైయున్నాడు

ఈలాటి పోలికలో విదితమైన తొలి సత్యం, క్రీస్తు సంఘమునకు ప్రభువైయున్నాడు అనేది. గొర్రెల కాపరిగా తన్ను పోల్చుకున్నప్పుడు ప్రభువు తానే గొర్రెలకు సొంతగాడై యున్నాడు; ఆయన మందయొక్క మిక్కిలి బలముగల ఏలికయై ఉన్నాడు.

గొర్రెలు గొర్రెలవాడి సొత్తు అయ్యున్నట్టే, మందలో చేరినవారెవరైనా క్రీస్తు ప్రభువుయొక్క సొత్తయి ఉంటారు. సొంతగాడు అనే ఈ భావన రెండు దిశలగుండా వెళ్లుతోంది: మొదటిగా, గొర్రెలు గొర్రెలవాడికొరకు బ్రదుకుతాయని గుప్తం చేయబడింది. మనం క్రీస్తుకు చెందిన కారణాన, మనం క్రీస్తు సేవకులం (ఫిలిప్పీ. 1:1). రెండవది, కాపరి గొర్రెలకొరకు బ్రదుకుతాడనేది. గొర్రెల సొంతగాడుగా, కాపరి గొర్రెలను ప్రేమిస్తాడు, వాటికొరకు బాధ్యత వహిస్తాడు, అవి పోషింపబడడానికి కావలసిన దాన్ని అనుగ్రహిస్తాడు. సొంతగాడితనం దానితో భారమైన బాధ్యతను కొనిపోతుంది, మంచి కాపరి ఆ బాధ్యతను నెరవేరుస్తాడు.

"తమ తల్లిదండ్రులవలె పిల్లలను లక్ష్యపెట్టేవారు ఎవరు ఉండరు" అని ఎవరో ఒకడన్నాడు. ఈ వాస్తవానికి కారణం స్పష్టంగానే ఉంది: పిల్లలు తమ సొంతమని తల్లిదండ్రులు ఎంతగా గుర్తిస్తారు. తమ పిల్లలను లోకంలోనికి తెచ్చారు; వారు కూడా

అదే రక్తమాంసాలు; వీరు వారికి బాధ్యులైయుంటారు. వారు తమ పిల్లలయందు ఆనందిస్తారు, కావలసినవాటిని యిస్తారు, మరియు వారి భవిష్యత్తును గూర్చి ప్లాన్ చేస్తారు.

క్రీస్తు, సర్వశక్తుడగు దేవుని కుమారుడు, తన సొంతవారికొరకు అత్యధికంగాను, దయార్ద్ర హృదయంతోను లక్ష్యపెడతాడు. తన భౌతికమైన అవసరతలకొరకు దేవుడు మానక లక్ష్యపెడుతున్నందుకు తాను కృతజ్ఞతలు చెల్లించే ఒక కీర్తనలో దావీదు యిలా అన్నాడు, "నేను చిన్నవాడనై యుంటిని, ఇప్పుడు ముసలివాడనై యున్నాను; అయినను నీతిమంతులు విడువబడుట గాని వారి సంతానము భిక్షమెత్తుట గాని నేను చూచి యుండలేదు" (కీర్తన. 37:25). కొండమీద ప్రసంగంలో ప్రభువైన యేసు తన శిష్యులను యిలా హెచ్చరించాడు, "కాబట్టి – ఏమి తిందుమో యేమి త్రాగుదుమో యేమి ధరించు కొందుమో అని చింతింపకుడి; అన్యజనులు వీటన్నిటి విషయమై విచారింతురు" (మత్తయి 6:31). ప్రభువు యిలా తెలియజేశాడు, "దొంగ దొంగతనమును హత్యను నాశనము చేయుటకు వచ్చును గాని మరి దేనికిని రాడు; గొఱ్ఱెలకు జీవము కలుగుటకును అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితినని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 10:10). మన మంచి కాపరి మనకు సొంతగాడైయుండి మన శరీర సంబంధమైన, ఆత్మసంబంధమైన అవసరతలను తీర్చుతాడు.

ఈ సత్యం మనమీద బలీయంగా పని చేయాలి. క్రీస్తు ప్రభువు మనకు సొంతగాడై ఉన్నాడంటే, ఆయన మనమీద శ్రద్ధ వహించేవాడై యున్నాడు. అప్పుడు మనం ఎందుకు చింతించాలి? మనం ఎందుకు భయపడాలి? నిన్ను కాచే మంచి కాపరియందు నమ్మిక యుంచుము. మన ఏకైక బాధ్యత ప్రభువైన యేసును వెంబడించడమే; యిక మిగిలినదంతా ఆయనే చూచుకొంటాడు.

## క్రీస్తు సంఘాన్ని నడిపిస్తాడు

రెండవది, "మంచి కాపరి" యొక్క పోలిక క్రీస్తు సంఘాన్ని నడిపిస్తాడని మనకు జ్ఞాపకం చేస్తుంది. గొర్రెలు తమ కాపరిని వెంబడించినట్టు, సంఘము క్రీస్తును అనుస రిస్తుంది. మనం ఆయన స్వరాన్ని గుర్తుపట్టి దానికి బదులిస్తాం. ప్రభువు యిలా అన్నాడు,

> గొఱ్ఱెల దొడ్డిలో ద్వారమున ప్రవేశింపక వేరొక మార్గమున ఎక్కువాడు దొంగయు దోచుకొనువాడునై యున్నాడు. ద్వారమున ప్రవేశించువాడు గొఱ్ఱెల కాపరి. అతనికి ద్వార పాలకుడు తలుపు తీయును, గొఱ్ఱెలు అతని స్వరము వినును, అతడు తన సొంత గొఱ్ఱెలను పేరుపెట్టి పిలిచి వాటిని వెలుపలికి నడిపించును (యోహాను 10:1–3).

ప్రతి రాత్రి, కాపరి గొర్రెలను అన్నిటిని ఉమ్మడిగానున్న దొడ్డిలోనికి నడిపిస్తాడు, చుట్టును గోడవంటి కటకటాలకు ఒకే ద్వారముంటుంది. దాని ద్వారము వద్ద రాత్రియంతా ఒక ద్వార పాలకుడు పెట్టబడతాడు. ఉదయ కాలమున, కాపరి వస్తాడు, ద్వార పాలకునిచే గుర్తింపబడతాడు. కాపరి లోపలికి ప్రవేశిస్తాడు, అతడు గొర్రెలను తన వద్దకు పిలుచుకొని, పచ్చిక బయలునకు వాటిని తోలుకొనిపోతాడు. దొంగ గాని దోచుకునేవాడుగాని ద్వారం

గుండా పోలేదు అందువలన వాడు గోడ ఎక్కి ప్రవేశించవలసి వస్తుంది. అతడు ద్వార పాలకునిచేత గుర్తు పట్టబడడు గనుకనే ద్వారంలోగుండా దొడ్డిలో ప్రవేశింపలేడు.

ప్రభువైన యేసు యింకను యిలా తెలియజేశాడు, "మరియు అతడు తన సొంత గొఱ్ఱెలనన్నిటిని వెలుపలికి నడిపించునప్పుడెల్ల వాటికి ముందుగా నడుచును; గొఱ్ఱెలు అతని స్వరమెరుగును గనుక అవి అతనిని వెంబడించును. అన్యుల స్వరము అవి ఎరుగవు గనుక అన్యుని ఎంత మాత్రము వెంబడింపక వానియొద్దనుండి పారిపోవునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని వారితో అనెను" (యోహాను 10:4, 5). ఉదయమున, దొడ్డిలోనుండి తన గొర్రెలను వెలుపలికి నడిపించడానికి కాపరిరాగా, అతడు కేవలం దొడ్డియొక్క ద్వారమునొద్దకు వెళ్లి వాటిని పిలుస్తాడు, గొర్రెలు అతని స్వరము విని తనయొద్దకు పరుగెత్తుకొని వస్తాయి. గొర్రెలు దొడ్డిని విడిచాయంటే, కాపరితప్ప వాటికి వేరే భద్రత లేదు. నిర్భయంగా మేత మేస్తూ, హాని కలుగకుండేలా నడిపించడానికి అవి సంపూర్ణంగా కాపరిమీదనే ఆధారపడి ఉంటాయి.

తన గొర్రెలకు కాపరి పూర్తిగా యజమానుడై ఉంటాడు. తాను ఎక్కడికి నడిపించితే అక్కడికెల్లను గొర్రెలు వెళ్లతాయి. అవి కాపరియొక్క అదిలింపుతోను, తెలివితోను నడిపింపబడతాయి. జంతువులన్నిటిలో, గొర్రెలు వెంబడించే స్వభావం కలవి. స్వతంత్రించి మార్గాన్ని వెదకుకునే తెలివి వాటికుండదు. మంచిగా నడిపింపబడితే మాత్రం, మంచి జీవితాన్ని అవి అనుభవిస్తాయి.

ఈ విషయంలో మనం గొర్రెలవంటివారమై యున్నాం. నాయకత్వం లేకుండ, సహాయపు చేతిని అందుకోగోరిన అంధులవలె మనం తొట్రిల్లుతాం. యెషయా యిలా దాఖలు చేశాడు, "మనమందరము గొర్రెలవలె త్రోవ తప్పిపోతిమి. మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలిగెను ..." (యెషయా 53:6). యిర్మీయా యిలా అన్నాడు, "యెహోవా, తమ మార్గము నేర్పరచుకొనుట నరులవశములో లేదనియు, మనుష్యులు తమ ప్రవర్తనయందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదనియు నేనెరుగు దును" (యిర్మీయా 10:23). మనకు సరియైన మార్గదర్శకత్వం ఉండాలి, లేకుంటే విపత్తు మనకొరకు వేచియుంటుంది.

---

మంచి కాపరి గొర్రెలకు ఏమైయున్నాడో, ప్రభువైన
యేసు మనకు అదే అయ్యున్నాడు - ఆయన
మనకు నాయకుడును, మార్గ దర్శకుడైయున్నాడు.

---

మంచి కాపరి గొర్రెలకు ఏమైయున్నాడో, ప్రభువైన యేసు మనకు అదే అయ్యున్నాడు – ఆయన మనకు నాయకుడును, మార్గ దర్శకుడైయున్నాడు. ఆయన సంఘమునకు శిరస్సు (ఎఫెసీ. 5:23), మనలను మహిమకు తెచ్చే మన రక్షణ కర్తయైయున్నాడు (హెబ్రీ. 2:10). "దేవుని మూలముగా ఆయన మనకు జ్ఞానమును నీతియు పరిశుద్ధతయు విమోచనమునాయెను" అన్నట్టు మనం ఆయనవైపు చూస్తాం (1 కొరింథీ. 1:30).

మన బలహీనతలను ఎరిగినవారమై, "విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించు వాడునైన యేసువైపు చూచుచు" మన ఎదుట ఉంచబడిన పందెములో పరుగెత్తాలని గుర్తించాలి (హెబ్రీ. 12:2). ఆయనను తేరి చూడుము; మన నాయకుడును ప్రభువునై యున్నట్టు ఆయనవైపు చూస్తాం.

ఒక కారుకు హెడ్ లైట్స్ లేకుండ మధ్య రాత్రిలో ఎత్తుగా ఎక్కి లోతుగా దిగుతూ ఉండే కొండ మార్గంలో, తీక్షణమైన వంకలు తిరుగుతూ నడుప ప్రయత్నిస్తున్నట్టు ఊహించు. అలా చేయ బూనడం ఆత్మహత్య చేసికొనడమే ఔతుంది. తటాలున సంభవించు విపత్తు తథ్యం; ఎక్కడ లేక ఎప్పుడు యాక్సిడెంట్ జరుగుద్దో నీవు ఎరుగలేవు. దైవికమైన రూప చిత్రమది. హెడ్ లైట్స్ లేకుండ అర్ధరాత్రిలో అపాయకరమైన మార్గంలో కారును నడిపిస్తున్న వాడివలెనే, ఇతడు కూడా నాశనమునకు జోగుతున్నాడు!

ఏదియెలాగున్నా, కొండలలో, లోయలలో, గోతులలో, మరియు జీవితంయొక్క కరుకు రాళ్లగుండా వెళ్లవలసినప్పుడు ఆయన తన గొర్రెలకు దైవికమైన మార్గాన్ని చూపుతూ, ఏ భయము కలిగించలేనంతగా ప్రభువు మనకు అభయమిస్తున్నాడు. ప్రభువైన యేసు మన నాయకుడుగా, ఈ జీవితపు ప్రయాణాన్ని కొనసాగించేటప్పుడు క్షేమంలో మనం విశ్రమించవచ్చు.

ఆఫ్రికా అరణ్య ప్రాంతంలో వేటకు బయలుదేరిన కొందరు వేటగాళ్లు, "నీ వద్ద దీపముందా?" అని వారి మార్గ దర్శకుని అడిగారట. "నేనే మీ దీపాన్ని!" అని అతడు బదులు చెప్పాడట. ఆయన వాక్యం ద్వారా – ప్రభువైన యేసుతో మనకున్న బాంధవ్యం అలాటిదే, ఆయన మన దీపమైయున్నాడు! "ఆయనను ఒకడు వెంబడింపకుండ, యేసు మాటలను వినవచ్చు గాని, ఆయన మాట వినకుండ ఒకడు యేసును వెంబడింపలేడు" అని ఒకడన్నాడు. మనం ఆయన మాటలు విని ఆయనను వెంబడిస్తాం.

దిశను చూపే విషయంలో ఎక్కువ జ్ఞానం లేనివారమనే గ్రహింపు కలిగియుండడం నిరాశాజనకమై యుండవచ్చు, కాని సర్వజ్ఞాని, తప్పుచేయనేరని కాపరి మనలను నడిపిస్తున్నాడనే గ్రహింపు, మనలో ఉన్న నిరాశలను ప్రభువుతో మనకున్న బాంధవ్యాన్నిబట్టి అనంతమైన అభినందనలుగా మార్చబడతాయి. మన అత్యంత కఠినమైన అవసరతలు సర్వశక్తిగల, సర్వజ్ఞానముగల నాయకునిచే సరఫరా చేయబడతాయి.

## క్రీస్తు సంఘమును ప్రేమిస్తున్నాడు

మూడవది, సంఘమును ప్రేమించి క్రీస్తు దానికొరకు మంచి కాపరివలె తన ప్రాణము పెట్టినట్టు ఈ పోలిక చిత్రిస్తుంది. ఆయన గొర్రెలను లక్ష్యపెట్టి, తన ప్రాణ త్యాగముతో ఆయన వాటిని కాపాడును. ప్రభువు యిలా అన్నాడు,

> నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని; మంచి కాపరి గొఱ్ఱెలకొరకు తన ప్రాణముపెట్టును. జీతగాడు గొఱ్ఱెల కాపరికాడు గనుక గొఱ్ఱెలు తనవికానందున తోడేలు వచ్చుట చూచి గొఱ్ఱెలను విడిచిపెట్టి పారిపోవును; తోడేలు ఆ గొఱ్ఱెలను పట్టి చెదరగొట్టును. జీతగాడు జీతగాడే గనుక గొఱ్ఱెలనుగూర్చి లక్ష్యము చేయక పారిపోవును. నేను గొఱ్ఱెల మంచి

కాపరిని. తండ్రి నన్ను ఏలాగున ఎరుగునో నేను తండ్రిని ఎలాగు ఎరుగుదునో ఆలాగే నేను నా గొఱ్ఱెలను ఎరుగుదును, నా గొఱ్ఱెలు నన్ను ఎరుగును. మరియు గొఱ్ఱెలకొరకు నా ప్రాణము పెట్టుచున్నాను (యోహాను 10:11-15).

మంచి కాపరిగా, ప్రభువైన యేసు రెండు రకాలైన కాపరులకు వ్యత్యాసంగా నిలిచియున్నాడు. మొదటిది, ఆయన జీతగాని వంటివాడు కాదు. జీతానికి కాపరిగా పని చేసేవాడు తన పనికి జీతం పుచ్చుకోవాలనే చేస్తాడు. జీతగాడు కూలికి పని చేసేవాడు; తన బాధ్యతను నేరవేర్చడానికి అతనికి జీతం యివ్వబడుతుంది. అతడు దుష్టుడు గాని, కీడు చేసేవాడు కానప్పటికి, నిజమైన కాపరికి ఉండే వ్యక్తిగతమైన అక్కర గొర్రెలపై అతనికి ఉండదు. ఒకసారి తన పని అయిపోయిందంటే మాత్రం, ఆ గొర్రెలను గూర్చి అతడు యికను పట్టించుకోడు. రెండవది, స్వార్థపరమైన ఆలోచనలతో తన పనిని జరిగించని అపనమ్మకస్థులైన కాపరులవంటివాడు ప్రభువు కాడు. దేవుని పక్షంగా అతడు మాట్లాడుతూ, అపనమ్మకస్థులైన కాపరులను గూర్చి యెహెజ్కేలు స్పష్టంగా మాట్లాడాడు:

బలహీనమైనవాటిని మీరు బలపరచరు, రోగముగలవాటిని స్వస్థపరచరు, గాయపడిన వాటికి కట్టుకట్టరు, తోలివేసినవాటిని మరల తోలుకొనిరారు, తప్పిపోయినవాటిని వెదకరు, అది మాత్రమేగాక మీరు కఠినమనస్కులై బలాత్కారముతో వాటిని ఏలుదురు. కాబట్టి కాపరులు లేకయే అవి చెదరిపోయెను, చెదరిపోయి సకల అడవి మృగములకు ఆహారమాయెను. నా గొఱ్ఱెలు పర్వతములన్నిటిమీదను ఎత్తయిన ప్రతి కొండమీదను తిరుగులాడుచున్నవి, నా గొర్రెలు భూమియందంతట చెదరిపోయినను వాటినిగూర్చి విచారించువాడొకడును లేడు, వెదకువాడొకడును లేడు (యెహెజ్కేలు 34:4-6).

ఆ గొర్రెల కాపరులకంటె ప్రభువైన యేసు వ్యత్యాసమైనవాడు. ఆయన గొర్రెలకు "మంచి" కాపరి. "మంచి" అని ప్రభువు వినియోగించిన పదం "రమ్యమైన" అనే పదం వంటిది. ఆయన "రమ్యమైన" కాపరియే. ఆయన తన పనికి జీతము పుచ్చుకోలేదు, కాని తాను గొర్రెలను ప్రేమించిన హేతువుచేత వాటికొరకు ఆయన తన ప్రాణాన్ని పెట్టాడు. వాటి కాపుదలకొరకు తన ప్రాణమైన రక్తాన్ని ధారపోశాడు. అపాయం భయపెడుతున్నప్పుడు, తోడేలో లేక సింహమో మందకు హాని చేయవచ్చినప్పుడు – ఆయన అపాయంనుండి తన్ను తాను కాపాడుకొనడానికి దాగడు. తన ప్రాణానికి ముందు తన గొర్రెలయొక్క ప్రాణం, వాటి భద్రత వస్తుంది.

యోహాను 10:14, 15 ప్రకారం, ప్రభువైన యేసు తన గొర్రెలతో సన్నిహిత సంబంధం కలిగి యున్నట్టు తెలుస్తోంది – ఈ సంబంధం తండ్రితో తనకున్న సంబంధాన్ని పోలియుంది. ఈ రెండు వచనాల్లో తన గొర్రెలతో తనకున్న సంబంధాన్ని తెలుపుతూ "ఎరుగును" అనే పదాన్ని ప్రభువైన యేసు నాలుగు పర్యాయాలు వినియోగించాడు. ఆయన తన గొర్రెలతో చీకటిలోను వెలుగునందును, శ్రమలోను ఆరోగ్యమందును, అపాయంలోను సమాధానమందును వ్యక్తిగతంగా ఉంటాడు. ప్రతి గొర్రెయు ఆయన ఎడతెగని దృష్టి, ప్రేమ, అక్కరలను పొందుతూ ఉంటుంది. ఆయన ప్రోత్సహించుతాడు, లక్ష్యపెడతాడు, తన గొర్రెలను దయగా కాస్తూ ఉంటాడు; అపాయ కాలంలో ఆయన తన బలముతో వాటిని కాపాడుతూ ఉంటాడు.

వంతెన పగిలిపోయి ప్రవాహంగా వచ్చిన వరద నీటిలో వృద్ధ దంపతులు చిక్కుకొని పోయిన కథ ఒకటి చెప్పబడింది. వరద నీరు పెరుగుతున్నాయి, అపాయంనుండి తప్పించే పనులు సాగుతున్నాయి. ముంచుకొస్తున్న నీరు ఎత్తయిన స్థలాన్ని ప్రతిసారి కష్టంగా చేస్తుంది. ప్రతి నిమిషము ముఖ్యమైనదిగా కన్పిస్తుంది. ఆ వృద్ధ దంపతులు తమ ఇంటి పై భాగాన నిలిచి సహాయంకొరకు ఎదురు చూస్తున్నారు. తప్పించే బోటు దగ్గరకు వచ్చింది, అయితే దానిలో ఒకరికే చోటుంది. తన భార్యను ఆ స్థలంలో కూర్చోమన్నాడు, అయితే ఆమె కఠినంగా నిరాకరించింది. అపాయం ఏమైనా ఆమె భర్తతోనే ఉండిపోవాలని తీర్మానించుకొంది. సమయం వ్యర్థం చేయగలిగినట్టు లేదు; నీరు బహు త్వరితంగా పైకి వచ్చేస్తోంది. (రెస్క్యూ బోట్) రక్షణ బోటులోని మనిషి వారితో యిలా అన్నాడు, “ఈ ప్రయాణికులను క్షేమకరమైన చోటుకు తీసికొనిపోయి, నేను మీ కొరకు త్వరగా వచ్చేస్తాను. నేను దీన్ని చేయగలనని నిరీక్షిస్తున్నాను; అయితే మేము గొప్ప ఆపదను తీసికొంటున్నాం. నీరు బహు వేగంగా పైకి లేస్తున్నాయి” త్వరపడి ఎత్తు చోటికి లోపలి ప్రయాణికులను తీసికొని వెళ్లి వారిని దింపి వెంటనే అతడు తిరిగి వచ్చాడు, ఆ యిల్లు ఆ దంపతులు కొట్టుకొని పోయినట్టు కనుగొనడానికే. తన ప్రియమైన భార్య అతనితో నిలిచియున్నది, వారిద్దరు కలిసి చనిపోదామనే ఉద్దేశంతోనే. అంతకు మించిన ప్రేమ ఏదైనా ఉంటుందా? అవును, “తన స్నేహితులకొరకు తన ప్రాణము పెట్టువానికంటె ఎక్కువైన ప్రేమగలవాడెవడును లేడు” (యోహాను 15:13). ఇతరులు జీవించునట్టు తాను చనిపోవునది అత్యుత్తమమైన ప్రేమ. మన కాపరి ఈలాటి ప్రేమగలవాడు, గాఢమైన ప్రేమా రూపమది, మరణంకంటె బలమైన ప్రేమ అది. గొర్రెలకొరకు ఆయన తన ప్రాణమును పెట్టియున్నాడు (యోహాను 10:15).

యోహాను సువార్త మొదటి శతాబ్దంయొక్క చివరి భాగంలో, ఒకవేళ క్రీ.శ. 85–95 మధ్య కాలం వ్రాయబడినట్టు సమస్త రుజువు సూచిస్తుంది. గనుక, తొలి పాఠకులు, తన ప్రాణాన్ని పెడతానన్న ప్రభువు మాటలను వారు ఎరగడం మాత్రమే గాక, గొర్రెలకొరకు ఆయన తన ప్రాణాన్ని నిజంగా పెట్టినట్టు కూడా ఎరుగుదురు. సంఘంకొరకు మరణించడం ద్వారా తన గొర్రెలపట్ల ఆయనకున్న ప్రేమయొక్క కట్టకడపటి బయల్పాటును ఆయన కనుపరచాడు.

ఈ సత్యం మనకు ఎంతగా ఆదరణ కలిగించాలి! మనలను నడిపించే సర్వశక్తిగల ప్రభువు మనకున్నాడు. ఆయన మనలో ప్రతి ఒక్కరిని ప్రేమిస్తూ, తన నడిపింపును మాత్రమే కాకుండ, ఆయన ప్రేమను, ఆయన కాపుదలను మనకు వాగ్దానం చేశాడు. పౌలు యిలా అన్నాడు, “ఏలయనగా శత్రువులమై యుండగా, ఆయన కుమారుని మరణముద్వారా మనము దేవునితో సమాధానపరచబడిన యెడల సమాధానపరచ బడినవారమై, ఆయన జీవించుటచేత మరి నిశ్చయముగా రక్షింపబడుదుము” (రోమా 5:10). మనము మన పాపములలో ఉన్నప్పుడే, మనకొరకు మరణించునంతగా ప్రభువైన యేసు మనలను ప్రేమించినయెడల, ఆయనకొరకు బ్రదుక ప్రయత్నించుచూ, ఆయన గొర్రెలమైయున్నప్పుడు మన రక్షణకొరకు ఆయన మరి ఎంత ఎక్కువగా శ్రద్ధవహిస్తాడో!

## ముగింపు

యోహాను 10లోని పోలికలో, సంఘము క్రీస్తుయొక్క మందయైయున్నట్టును, అది తనకు చెందిన గొర్రెలన్నిటితో కూడినదైయున్నట్టును ప్రకటించబడింది. "ఈ దొడ్డివి కాని వేరే గొర్రెలును నాకు కలవు; వాటిని కూడ నేను తోడుకొని రావలెను, అవి నా స్వరము వినును, అప్పుడు మంద ఒక్కటియు గొర్రెల కాపరి ఒక్కడును అగును" అని ఆయన అన్నాడు (యోహాను 10:16). "వేరే గొర్రెలు" అని ఆయన సూచించింది, లేక కనీసం తన మాట విని ఆ మందలో చేర్చబడే అన్యజనులై యుండాలి. ఆయన పోలికకు ఒకే మంద, ఒకే కాపరి ఉన్నట్టు సూచింపబడింది. ఒకే కాపరి క్రింద మనం ఒకే మంద అయ్యుండాలి, లేదా మనం కానట్టయినా అయ్యుండాలి. మనం ఆయన సంఘం, క్రొత్త నిబంధన సంఘం, అయ్యుండాలి, లేదా మనం కానివారమైనా అయ్యుండాలి.

మంద/కాపరి అనే ఈ పోలికలో గుప్తమైయున్న విశేషమేమంటే మన భయములను మన చింతలను అది పారద్రోలుతుంది. మనం ఎవరమో మనకు తెలుసు, మనం ఆయన గొర్రెలం; ఏమి చేయాలో మనకు తెలుసు, ఆయన స్వరంచేత మనం నడిపింపబడతాం; మన భవిష్యత్తు భద్రంగా ఉంది, ఆయన జీవము మరణములచేత మనం కాపాడబడతాం. ఆయన మన ప్రభువైయున్నందున, ఆయనకు చెందిన భావన మనకుంది; మనకు నిజమైన వివేకముంది ఎందుకంటె, పరలోకపు ప్రభువు మనకు నాయకుడు; సర్వశక్తుడగు క్రీస్తునుండి పరలోక సంబంధమైన భద్రత మనకుంది, ఆయనే స్వయంగా తన ప్రాణం పెట్టునంతగా మనలను ప్రేమించాడు! మనం ఎవరమో మనం ఎరిగి, తప్పు కాజాలని నడిపింపు కలిగియుండి, త్యాగ పూరితమైన క్రీస్తు ప్రభువుయొక్క కాపుదల కలిగియున్నప్పుడు, మనం ఎందుకు భయపడాలి? మన కాపరియందలి మన విశ్వాసము సమస్త భయములను పారద్రోలుతోంది.

మోషే యుగంలో దావీదు దేవుని గూర్చి వ్రాసిన కీర్తన. 23 యొక్క మాటలు నేడు క్రీస్తు ప్రభువుకు వర్తింపజేసి మనం వాటిని మనవిగా చేసికోవచ్చు:

> [ప్రభువైన యేసు] నా కాపరి,
> నాకు లేమి కలుగదు.
> పచ్చికగల చోట్లను ఆయన నన్ను పరుండజేయుచున్నాడు;
> శాంతికరమైన జలములయొద్ద నన్ను నడిపించుచున్నాడు.
> నా ప్రాణమునకు ఆయన సేద దీర్చుచున్నాడు;
> తన నామమునుబట్టి నీతి మార్గములలో నన్ను నడిపించుచున్నాడు.
>
> గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను
> ఏ అపాయమునకు భయపడను;
> నీవు నాకు తోడైయుందువు;
> నీ దుడ్డుకర్రయు నీ దండమును నన్ను ఆదరించును.
> నా శత్రువులయెదుట నీవు నాకు భోజనము సిద్ధపరచెదవు;
> నూనెతో నా తల అంటియున్నావు;
> నా గిన్నె నిండి పొర్లుచున్నది.
> నేను బ్రదుకు దినములన్నియు కృపా క్షేమములే నా వెంటవచ్చును.

చిరకాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను.

చాల సంవత్సరాల క్రిందట, యౌవ్వన సువార్తికుడుగా, క్రీస్తునందున్న ఒక సహోదరుని భూ స్థాపన కార్యక్రమానికి హాజరయ్యాను. సమాధి కార్యక్రమంలో ప్రసంగించినవాడు శారీరకంగా మా అన్నయే. నాకు జ్ఞాపకమున్నంతవరకు, చనిపోయిన వ్యక్తి తాను చనిపోయే సమయానికి నలభైలలోనే ఉన్నాడు. చనిపోకమునుపు ఆ వ్యక్తియొక్క చివరి మాటలను గూర్చి మా అన్న వ్యాఖ్యానించాడు. అతడు నెమ్మదిగా కీర్తన. 23ను కోట్ చేశాడట, మరియు ఆ కీర్తన యొక్క చివరి మాటలు గుసగుస లాడినట్టు పలుకబడ్డాయి, దానితో అతని శ్వాస ఆగిపోయిందట. తన జీవితపు చివరి గడియలలో, కీర్తన. 23ను వల్లించడంలో అతడు ఆదరణను కనుగొన్నాడు.

దేవుడు మన కాపరిగా ఆలోచిస్తున్నప్పుడు భయకంపితమైన, కలతచెందిన హృదయాలలోనికి శాంతి, ప్రశాంతత ప్రవేశిస్తాయి. క్రీస్తు ప్రభువు మంచి కాపరిగాను, ఆయనను వెంబడించేవారు గొర్రెలుగాను చిత్రింపబడిన ఈ పోలిక, అదేవిధంగా మన చింతలకు సహాయపడతాయి.

నీవు క్రీస్తుయొక్క మందలో లేకున్నట్టయితే, నీవు క్రీస్తు అనే ఆ ఒక్క ద్వారంగుండానే ప్రవేశించాలి. వివరంతో కూడిన పోలిక మధ్యలో (యోహాను 10:1-5, 10-18), చిన్న పోలికను ప్రభువు అమర్చాడు (యోహాను 10:7-9). ఆయన యిలా అన్నాడు, "నేనే ద్వారమును; నా ద్వారా ఎవడైన లోపల ప్రవేశించిన యెడల వాడు రక్షింపబడినవాడై, లోపలికి పోవుచు బయటికి వచ్చుచు మేత మేయుచునుండును" (యోహాను 10:9). ప్రభువు తరువాత యిలా తెలిపాడు, "-నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" (యోహాను 14:6). ఒకడు ఆయన వాక్యమునకు లోబడినప్పుడు, క్రీస్తు ప్రభువు ద్వారా ఆయన మందలోనికి ప్రవేశిస్తాడు (యోహాను 8:24; లూకా 13:3; మత్తయి 10:32, 33; మార్కు 16:16).

మంచి కాపరియైన క్రీసు వద్దకు రమ్ము. ఆయన మందలో ప్రవేశించి, నీ జీవితానికి ఆయనను కాపరిగా ఉండనిమ్ము, ఆయన అనుగ్రహించు సమృద్ధియైన జీవంలో పాలుపొందు (యోహాను 10:10). ఆయన మందలో, నీకు రక్షణ కలుగుతుంది (యోహాను 10:9), సమృద్ధియైన జీవం దొరుకుతుంది (యోహాను 10:10), భయమునుండి విడుదల (యోహాను 10:12), ప్రేమ (యోహాను 10:15), నడిపింపు (యోహాను 10:4, 5), నిత్యజీవము (యోహాను 10:17) నీకు లభిస్తుంది. క్రీస్తు మందలోని గొర్రెగా జీవించేదానికంటె శ్రేష్ఠమైన మార్గాన్ని నీవు ఆలోచించగలవా?

## స్టడీ మరియు చర్చకొరకైన ప్రశ్నలు

1. నీవు నిరాశ చెందినప్పుడు ఏమి చేస్తావు?
2. యోహాను సువార్తలో యివ్వబడిన ఉపమానములెన్ని?
3. క్రీస్తు సంఘమునకు ప్రభువై ఉన్నాడంటే, ఆయనకును మనకును ఉన్న

భావమేదో వర్ణించు.

4. క్రీస్తు తన మందకొరకు లక్ష్యపెడుతున్నాడనే వాస్తవం నిన్నెలా ప్రోత్సహించుతోంది?
5. యోహాను 10:10 యొక్క సందర్భాన్ని, ప్రత్యేకమైన అర్థాన్ని చర్చించు.
6. తమ్మును తాము నడిపించుకొనడంలో గొర్రెలయొక్క అసమర్థతను వర్ణించు.
7. తన గొర్రెలకు కాపరి నాయకత్వాన్ని ఎలా దయచేస్తాడు?
8. దైవికమైన నడిపింపును నిరాకరించే జనులకు ఏ రకమైన భవిష్యత్తు ఉంటుంది?
9. "జీతగానిని" వర్ణించి, మంచి కాపరితో వానిని పోల్చుము.
10. యెహెజ్కేలు 34:4-6లో చిత్రింపబడిన అపనమ్మకస్థులైన కాపరులయొక్క గుణ విశేషముల నిమ్ము.
11. యోహాను 10లో "ఎరుగును" అనే పదాన్ని గమనించి, ఈ పదంయొక్క భావం మీద వ్యాఖ్యానించు (14, 15 వచనాలను గుర్తించు).
12. యోహాను 10:16లోని "వేరే గొర్రెలు" ఎవరు?
13. ఒక వ్యక్తి క్రీస్తుయొక్క గొర్రెగా ఎలా కాగలదు?

---

సూచనలు

[1]ప్రభువైన యేసు ఉపయోగించిన పోలికను యోహాను "సామెత" అని పిలిచాడు. అతడు *paroimia* అనే పదాన్ని ఉపయోగించాడు, కొన్ని క్రొత్త నిబంధన తర్జుమాలు దానిని "ఉపమానము" అని తర్జుమా చేశాయి; అయితే "ఉపమానం" అనే దానికి క్రొత్త నిబంధన గ్రీకు పదం *parabole*, యిది సంపూర్ణంగా వేరైన పదమైయుంది. మన ప్రభువు జీవితానికి సంబంధించి (*parabole*) ఉపమానమనే పదాన్ని యోహాను ఎన్నడు ఉపయోగించలేదు, మరియు మత్తయి, మార్కు, లూకా అనేవారు వారి సందేశంలో *paroimia* అనే పదాన్ని ఎన్నడు ఉపయోగించ లేదు. యోహాను ఉపయోగించిన పదం యొక్క వెలుగులో, యేసు అనే ఉదాహరణ లేక పోలిక విస్తరింపజేయబడిన సామెతవంటిదిగా చూడబడాలి, వింతైన భావన కుదించబడిన యోచన భావభరితమైనదిగా చూడబడాలే తప్ప, సాధారణ పోలికగా దాన్ని తలంచకూడదు.